ప్రజాశక్తి

శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

అంతర్రాష్ట్ర సరిహద్దులో అప్రమత్తం

- ఎన్‌టిఆర్, ఖమ్మం జిల్లాల సమీక్షలో కలెక్టర్ డిల్లీరావు
- డబ్బు, మద్యం, గంజాయి అక్రమ రవాణా నివారణకు చర్యలు

మీడియాతో మాట్లాడుతున్న ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి - తిరువూరు : అంతర్రాష్ట్ర సరిహద్దు వెంబడి ప్రత్యేక చెక్‌పోస్ట్‌లతో నిఘాను పటిష్టం చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. గురువారం తిరువూరు రాజుపేటలోని శ్రీరస్తు కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఎపి ఎన్‌టిఆర్ జిల్లా, తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రెండు జిల్లాల కలెక్టర్లు ఎస్.డిల్లీరావు, వి.పి.గౌతమ్, ఎన్‌టిఆర్ జిల్లా సీపీ కాంతిరాణా టాటా, ఖమ్మం జిల్లా సీపీ సునీల్‌దత్‌తో పాటు సరిహద్దు నియోజకవర్గాల ఆర్‌వోలు, రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఐటీ, కమర్షియల్ ట్యాక్స్, జీఎస్‌టీ, అటవీ, బ్యాంకింగ్ తదితర శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు వెంబడి నగదు, మద్యం, గంజాయి, విలువైన వస్తువులు తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విషయంలో ఇప్పటికే తీసుకున్న చర్యలు, కొనసాగించాల్సిన చర్యలు, రెండు జిల్లాల మధ్య సమన్వయం, సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ ఎథికల్ ఓటింగ్‌తో పాటు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఈనేపథ్యంలో ఆ దిశగా కషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రలోభాలకు తావులేని వాతావరణంలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించేందుకు ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్‌టిఆర్, ఖమ్మం:

(మిగతా 6లో)

కృష్ణాజిల్లా నూతన కలక్టర్‌గా డికె బాలాజీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లా నూతన కలక్టర్‌గా డీకే బాలాజీని నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన పి.రాజాబాబుపై ఈసీఇ బదిలీ వేటు వేసింది. ఈనేపథ్యంలో ఆయన స్థానంలో బాలాజీని నియమించింది. 2015 బ్యాచ్‌కు చెందిన బాలాజీ కర్నూలు మున్సిపల్ కమిషనర్‌గా, కర్నూలు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా పని చేశారు. ప్రస్తుతం ఆయన వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కలెక్టర్ రాజాబాబుపై వేటు

విపక్షాల నుండి అందిన ఫిర్యాదుల మేరకు కష్ణాజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబును కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

ఆయన తక్షణం రిలీవ్ కావాలని, ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాజాబాబు గత ఏడాది ఏప్రిల్ 15న కష్ణాజిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

ఇళ్ల పేరుతో మోసగించిన వైసిపి, టిడిపి

'మార్పు కోసం సిపిఎం పాదయాత్ర'లో సిపిఎం నేత బాబూరావు

పాదయాత్రలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : అద్దెకు ఉన్న వారికి ఇళ్లు ఇస్తామని వైసీపీ, తెలుగుదేశం పార్టీలు మోసగించాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. చెత్తపన్ను, విద్యుత్ చార్జీలు, వంట గ్యాస్ ఇతర ధరలతో సాధారణ ప్రజలు కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో కమ్యూనిస్టుల ఉద్యమాల వల్లనే పేదలకు మేలు జరిగిందన్నారు. విజయవాడ 36వ డివిజన్ సీతన్నపేటలో గురువారం "మార్పు కోసం సిపిఎం పాదయాత్ర' జరిగింది. ఈసందర్భంగా జరిగిన ప్రచార సభల్లో బాబూరావు మాట్లాడుతూ ధరల భారాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. పేదలకు ఇళ్లిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేశాయన్నారున. గతంలోని తెలుగుదేశం, నేడు వైసిపి పేదల

(మిగతా 6లో)

తాగునీటికి కటకట

ఎట్టకేలకు నేడు ప్రకాశం బ్యారేజి నుండి నీరు విడుదల

ప్రజాశక్తి - విజయవాడ, కృష్ణా ప్రతినిధి : తాగునీటి అవసరాల నిమిత్తం శుక్రవారం ప్రకాశం బ్యారేజీ నుండి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. పులిచింతల ప్రాజెక్టు నుండి విడలైన నీటిని ప్రకాశం బ్యారేజి ద్వారా ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని కాల్వలకు వదులుతారు. బ్యారేజీ నుంచి కష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలు, గుంటూరు ఛానల్ ద్వారా ఈనెల 10వ తేదీ వరకు నీరు విడుదల చేయనున్నారు. తాగునీటి కోసమే విడుదల చేస్తున్న ఈ నీటిని చేపలు, రొయ్యల చెరువులు, ఇతర అవసరాల కోసం వాడుకోకూడదని అధికారులు స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎట్టకేలకు అధికారులు చర్యలకు

(మిగతా 6లో)



ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
విలేకర్లు కావలెను
ఉద్యోగ అవకాశాలు
ప్రజాశక్తి దినపత్రికలో పని చేసేందుకు కింది ప్రాంతాలకు విలేకరులు కావలెను.
విద్యార్హత: ఇంటర్, ఆ పైన..
విలేకరులు కావాల్సిన కేంద్రాలు:
ఎన్‌టిఆర్ జిల్లా
- విజయవాడ నగరంలో నాలుగు ఖాళీలు
- విజయవాడ రూరల్
- జి.కొండూరు
కృష్ణాజిల్లా
- పెనమలూరు
- పామర్రు
- నాగాయలంక
- గూడూరు
- కృత్తివెన్ను
- నందివాడ
ప్రాథమిక అర్హతలు :
- తెలుగులో స్పష్టంగా రాయగల నైపుణ్యం
- జిల్లా, రాష్ట్ర రాజకీయాలపై ప్రాథమిక అవగాహన
- కంప్యూటర్ తెలుగు టైపింగ్
- ఏదైనా తెలుగు పత్రికలో ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత..
ఆసక్తి గల వారు తమ బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్‌గానీ, vjadesk@gmail.com మెయిల్‌కుగానీ పంపగలరు
:: హాజరుకావాల్సిన చిరునామా ::
ప్రజాశక్తి కార్యాలయం
అరవింద హైస్కూల్ వద్ద, తాడేపల్లి
సంప్రదించాల్సిన నెంబర్లు
9490099206, 9490099530, 9490099218

ఆగి ఉన్న లారీని ఢీకొని భార్యాభర్తలు దుర్మరణం

ప్రజాశక్తి - ఘంటసాల

ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మతి చెందిన విషాద సంఘటన కృష్ణాజిల్లా ఘంటసాల మండలం లంకపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చల్లపల్లి మండలం మాజేరు శివారు పచ్చార్లంకకు చెందిన దాసరి నాగేశ్వరరావు (70), దాసరి బేబి సరోజిని (60) దంపతులు ద్విచక్ర వాహనంపై తెల్లవారుజామున చల్లపల్లిలో జరిగే ఓ కార్యక్రమానికి బయలుదేరారు. ఈ క్రమంలో లంకపల్లి వద్ద ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టడంతో వారిద్దరు కిందపడిపోయి తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే భార్యాభర్తలిద్దరూ అప్పటికే మరణించినట్లు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. ఇద్దరి మతదేహాలను పోస్టుమార్ధం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్యాభర్తల మృతితో పచ్చార్లంక గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడు దాసరి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఘంటసాల ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటన ప్రాంతంలో మరణించిన భార్యాభర్తలు దాసరి విజయ్ కుమార్ - బేబీ సరోజిని

రంజాన్ దీక్షల వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సాయంత్రం 6.35

సహర్ : శనివారం ఉదయం 4.45

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-వీరులుపాడు: మండల పరిధిలోని జమ్మవరం, బోడవాడ గ్రామంలో సిఐ చంద్రశేఖరరావు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ద్విచక్ర వాహనాలపై సైతం పార్టీకి చెందిన స్టిక్కర్ల అంటించిన వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రం నుండి ప్రతి ఒక్కరూ 100 మీటర్ల అవతలే ఉండాలని సూచించారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవహిస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అందుకు పోలీసువారి తరఫునుంచి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మణుడు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అహ్మదాబాద్‌కు అంబేద్కర్ ఫైబర్‌గ్లాస్ విగ్రహాలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన సూర్య శిల్ప శాల శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి రవిచంద్ర, శ్రీహర్ష తయారు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫైబర్ గ్లాస్ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. వీటిని గుజరాత్ లోని అహ్మదాబాద్ నగరంలో ప్రతిష్టించేందుకు తరలిస్తున్నట్లు శిల్పులు తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందిస్తున్నట్లు పార్లమెంట్ భవనాన్ని పోలిన పెడస్టల్ డిజైన్‌తో తొలిసారిగా ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని తయారు చేసినట్లు చెప్పారు. అహ్మదాబాద్ నుంచి విగ్రహం తయారీకి ఆర్డర్ లభించటం కూడా ఇదే ప్రథమంగా చెప్పారు. గతంలో అంబేద్కర్ విగ్రహాలను ఇరు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు కూడా పంపించామన్నారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో కూడా ప్రతిష్టించేందుకు అంబేద్కర్ విగ్రహాన్ని తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు సందర్శకులు శిల్పుల నైపుణ్యాన్ని ప్రశంసించారు.

7న హోమియో వైద్యంపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 11 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో హోమియోపతి వైద్యంపై ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. ఈ సభలో ప్రముఖ హోమియోపతి వైద్యులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ సభలో హోమియో వైద్యపితామహుడు డాక్టర్ హనీమన్ జయంతి కూడా నిర్వహించబడుతుందన్నారు. కావున ఆరోగ్యాభిలాషులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఆధునిక కబేళా నిర్మాణం చేస్తా

మంగళగిరిలో పెమ్మసాని ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 14, 15, 16 వార్డుల్లో గురువారం గుంటూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంగళగిరి బాప్టిస్ట్ పేటలో ఆధునిక కబేళ నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలు, కళ్యాణ మండపం నిర్మాణం చేస్తానని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్లు లేని 20వేల మంది నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్, ఎంపి అభ్యర్థిగా తనకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నందం అబద్దయ్య, పోతినేని శ్రీనివాసరావు, జి ధనుంజయ రావు, జనసేన పార్టీ నాయకులు మునగపాటి వెంకట మారుతీరావు, షేక్ సుభాని, టీ కొండలరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కే నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ చేయాలంటే మూడు నెలలు ఆగాల్సిందే..

ఎయిమ్స్‌లో వైద్య సేవలు అంతంత మాత్రమే - క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. స్కానింగ్ చేయాలంటే మూడు నెలలు ఆగాల్సిందే.. ఇది మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి పరిస్థితి. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి 2015 డిసెంబర్ 19 న శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 183 ఎకరాలు భూమిని కేటాయించింది. రూ.1680 కోట్లు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శంకుస్థాపన చేసిన రోజున 3సంవత్సరాల్లో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం 9 సంవత్సరాలు పూర్తయింది ఇంకా కట్టడాలు కడుతూనే ఉన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజీ, గుండెకు సంబంధించిన స్పెషలిస్టులు ఇంకా నియమించలేదు. అవుట్ పేషెంట్ డిపార్ట్మెంట్ 2019 మార్చి 12వ తేదీన ప్రారంభమైంది. ప్రస్తుతం ఓపి రోజుకు 1500 మంది రాష్ట్ర వ్యాప్తంగాను రోగులు వచ్చి ఇక్కడ వైద్యం చేయించుకుంటున్నారు. పది రూపాయలు ఫీజుతో వైద్యం చేస్తున్నారు. ఇక్కడ ఇన్ పేషెంట్లు వార్డు కూడా ప్రారంభమైంది. ప్రస్తుతం 350 మంది ఇన్ పేషెంట్లు ఉంటున్నారు. సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. వీల్ చైర్స్, స్ట్రక్చర్స్ చాలా తక్కువగా ఉండటం వలన వికలాంగ రోగులు ఇబ్బం దులు పడుతున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రి ప్రాంగణంలో మెడికల్ షాపు ఒకటే ఉంది. సాయంత్రం 6 గంటల వరకు మందులు కొరకు క్యూ లైన్‌లో నిలబడి నప్పటికీ చివరకు మందులు లేవని చెప్పడంతో రోగులు నిరాశ చెందుతున్నారు. పరీక్షలు చేయించు కోవడానికి మూడు రోజులు పాటు రావలసి ఉంది. పరీక్షలు చేసిన తర్వాత రిపోర్టులు రెండు మూడు రోజులు ఆలస్యం అవుతుంది. పరీక్షలకు ఫీజులు బాగానే వసూలు చేస్తున్నారు. పేదలకు అందవలసిన వైద్య సేవలు అంతంత మాత్రమే ఉన్నాయి. ఓపి కోసం, మందుల కోసం, డాక్టర్ల దగ్గర చూయించుకోవడానికి గంటలు తరబడి క్యూ లైన్ లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరీక్షలు కూడా క్యూ లైన్ లో ఉంటున్నారు. అనారోగ్యంగా ఉన్న రోగులు గంటలు తరబడి క్యూ లైన్‌లో నిలబడాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సిటీ, ఎమ్మార్ఐ, యు ఎస్ జి స్కాన్లు మాత్రం మూడు నెలలు తర్వాత రమ్మని చెబుతున్నారు. ఈలోగా ఎమర్జెన్సీ అయితే పట్టించుకోవడం లేదు. మరలా బయట కార్పొరేట్ హాస్పిటల్‌కు పోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. నెలలు తరబడి ఉండాలంటే ఇబ్బందిగా ఉంటుందని, వేరే ప్రైవేట్ హాస్పటల్‌కు పోవలసిన పరిస్థితులు ఏర్పడు తున్నాయని రోగులు ఆవేదనగా చెపుతున్నారు.

క్యూలో నిలబడ్డ రోగులు, వారికి సంబంధించిన వ్యక్తులు

వేల రూపాయల ఖర్చవుతోంది

గద్దె భాస్కరరావు, గొట్టిపాడు, గుంటూరు జిల్లా

ఎయిమ్స్‌లో తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుందని వచ్చాము. అయితే వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ట్రో ఎంట్రాలజీ స్పెషలిస్ట్ లేకపో వడం వలన జనరల్ వైద్యుల చేత వైద్యం చేయిస్తున్నారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో స్పెషలిస్టు లేకపోవడం చాలా బాధాకరమైన విషయం. రూ.10 ఫీజు అని చెప్పి పరీక్షలకు వేలల్లో వసూలు చేస్తున్నారు. మందుల రేట్లు కూడా ఎక్కువగా ఉన్నాయి. తాను అరికాళ్ళ నొప్పికి వైద్యం చేయించుకోవడానికి వచ్చానని నెల రోజులకు రూ.3000 మందులు రాశారని, వైద్య సేవలు మాత్రం మెరుగ్గా లేవన్నారు.

పరీక్ష ఫీజులు తక్కువగానే ఉన్నాయి

వి.ఆశీర్వాదం, లంక గ్రామం, రేపల్లె మండలం

పరీక్ష ఫీజులు మాత్రం తక్కువగానే ఉన్నాయి. రెండు, మూడు పరీక్షలు చేయించుకున్నాను. ఒక్కొక్క పరీక్షలకు రూ.250 తీసుకున్నారు. హెర్నియా వైద్యం కోసం ఇక్కడికి వచ్చానని చెప్పారు. పరీక్షలు రిపోర్టు ఇంకా రాకపోవడం వలన ఎదురు చూస్తున్నాను అన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరిలో పోటీ చేస్తున్న ఇండియా వేదిక ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావును గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యారావు కోరారు. గురువారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన ఎన్నికల్లో పని చేసే ముఖ్య కార్యకర్తల సమావేశం పోతురాజు స్వామిగుడి, పోలీస్‌స్టేషన్ వెనుక బజార్లలో జరిగిన జనరల్ బాడీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా సమావేశాలకు కొట్టె కరుణాకరరావు, కె.బాబూరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు మద్దతు ఇస్తున్నాయో చెప్పాలన్నారు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని తెస్తామని బహిరంగంగా చెబుతున్న బిజెపిని ఓడించడానికి దేశ వ్యాప్తంగా 300కు పైగా స్థానాల్లో ఇండియా వేదిక అభ్యర్థులు ముఖాముఖి తలపడుతున్నారని చెప్పారు. ఎన్నికల బాండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలు అక్రమార్జన చేసి ఆ డబ్బుతో ఎంపిలు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. వామపక్ష పార్టీలు ఇందుకు భిన్నంగా ఉన్నాయన్నారు. గ్యాస్ నుంచి పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు పెంచి ప్రజల కొనుగోలు శక్తిని తగ్గించారన్నారు. విద్యుత్ సర్ ఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరిచారన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఇళ్లు, ఇళ్లస్థలాలు, అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ ఉద్యమాలకు అండగా నిలిచిన జొన్నా శివశంకరరావు, ఎంపి అభ్యర్థికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ నాయకులు డి.విజయబాబు, కె.బాబూరావు, శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, ఎస్‌కె సుబానీ, ఎస్‌కె కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యారావు

'పశ్చిమ'లో పెత్తందారులకు చోటులేదు : ఆసిఫ్

ప్రజాశక్తి-వన్‌టౌన్: తమపై పెత్తందారుల పెత్తనాన్ని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు అంగీకరించబోరని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ చెప్పారు. ఇక్కడ కులమతాలకు అతీతంగా అన్ని మతాలు, కులాల ప్రజలు కలిసిమెలిసి అన్నాదమ్ములుగా జీవిస్తున్నారని, పెత్తందారులకు చోటు లేదని స్పష్టంచేశారు. ఒకవేళ డబ్బు మూటలతో వచ్చి నమ్మకంగా నటించి ఓట్లు పొంది, తర్వాత పెత్తనం చేయవచ్చని చూసినా కుదరదని, ఇక్కడ ప్రజలు చైతన్యవంతులని చెప్పారు. స్థానిక 47వ డివిజన్‌లో గురువారం ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన తాగునీరు వంటి కొన్ని సమస్యలపై అధికారులతో అక్కడి నుంచే మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతి పేదవాడి గడప వద్దకు నడిపంచారని, ఏ సమస్య ఉన్నా తెలుసుకుని వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఇంకా ఏమైనా మిగిలిపోయిన సమస్యలు ఉంటే తాము గడపగడపకు వెళ్లి తెలుసుకుని పరిష్కారానికి కషి చేస్తున్నామని తెలిపారు. కనీసం ఇక్కడ వీధులు, ప్రజలు, సమస్యలు ఏమీ తెలియని సుజనా చౌదరికి బీజేపీ సీటు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు చేసిన కుట్రలో భాగంగానే పశ్చిమ నియోజకవర్గానికి ఇవాళ ఒక పెత్తందారు డబ్బు మూటలతో వచ్చి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీల ఆత్మగౌరవంతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ వంటి మతోన్మాద పార్టీకి, దానికి వంతపాడుతున్న టీడీపీ, జనసేనలకు ఇక్కడ స్థానం లేదన్నారు. తమ స్వార్థం కోసం చివరికి వద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సైతం ఇబ్బంది పెడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏ ముఖం పెట్టుకుని ప్రజలకు ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాలనను, సంక్షేమ పథకాలను తమ ఇంటి ముంగిటకే తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్ వెంటే ప్రజలంతా ఉన్నారని, తమ లక్ష్యం 175కు 175 నియోజకవర్గాల్లో విజయం సాధించడమేనని ఆసిఫ్ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ, గోదావరి బాబు, యలకల చలపతిరావు, వడ్రా కార్పోరేషన్ డైరెక్టర్ దేరంగుల రమణ, అత్తులూరి పెద్దబాబు, ఎస్సి నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు కే. నాగ మల్లేశ్వరరావు, కమల జోజి, విజయ లక్ష్మి, దుర్గ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు సీటు కేటాయించడంపట్ల హర్షం



శుభాకాంక్షలు తెలుపుతున్న స్వర్ణలత

మొక్కులు తీర్చుకుంటున్న అభిమానులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ అసెంబ్లీ కి జనసేన పార్టీ తరపున మండలి బుద్ధ ప్రసాద్ పేరును జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇటీవల పవన్ కళ్యాణ్ సమక్షంలో పిఠాపురంలో జనసేన కండువా కప్పుకున్న బుద్ధ ప్రసాద్కు అవనిగడ్డ సీటును కేటాయిస్తూ గురువారం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీ తరపునుండి అవనిగడ్డ సీటును బుద్ధ ప్రసాద్ కేటాయించడంతో ఆ పార్టీల శ్రేణులు అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. బుద్ధ ప్రసాద్ నాయుడు మండలి వెంకట్రామను ఆయన స్వగృహం వద్ద కలసి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణసంచా పేల్చి సంబరాలు జరుపు కున్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలాశీల స్వర్ణలత బుద్ధ ప్రసాద్కు సీటు కేటాయించడం పట్ల అభినందనలు తెలిపారు. అలాగే జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు బుద్ధ ప్రసాద్ కు అవనిగడ్డ సీటును కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఆదేశాలను తమ పాటిస్తామని అన్నారు. అదేవిధంగా మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు కూడా పవన్ కళ్యాణ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.

మొక్కులు తీర్చుకున్న అభిమానులు

అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పేరును జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో బుద్ధ ప్రసాద్ అభిమానులు గురువారం సాయంత్రం అవనిగడ్డ రాజీవ్ సెంటర్ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో అభిమానులు పార్టీ కార్యకర్తలు నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా 216 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వీరంతా బుద్ధ ప్రసాద్కు సీటు వస్తే 108 చొప్పున కొబ్బరికాయలు కొడతామని ఇరువురు అభిమానులు మొక్కుకున్నారు. దీనితో ఆలయానికి చేరుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మండల పెద్ద ప్రసాదు విజయానికి కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రాం, శీలం అశ్వినికుమార్, టిడిపి నాయకులు మండల రామ్మోహన్‌రావు, నాగాయలంక చెందిన గ్రామ ఉప సర్పంచ్ తలసీల నరసింహారావు, చెన్ను గాంధీ బచ్చు వెంకట్ నాథ్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళంలో అవనిగడ్డ నియోజక వర్గం జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీ నాయకులు మండలి బుద్ధప్రసాద్ పేరు ప్రకటించడంతో కరకట్టపై తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ తాడికొండ చిన్న,జనసేన యువత ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. అనంతరం స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా తాడికొండ చిన్న మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం కూటమి అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్ పేరు ప్రకటించడం సంతోషమని అన్నారు. శ్రీకాకుళం, శీలంవారి పాలెం, సూరప నేనివారిపాలెం, వీరమాచిన ేనివారి పాలెం, పాపవి నాశనం, తెలుగురావు పాలెం గ్రామాల నుంచి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బహుమతులు పొందిన విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం : ఏపీఎన్జీసి ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం గన్నవరం గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో పిల్లలకు అడవులను కాపాడు కోవడం మొక్కల్ని పెంచడం ప్లాస్టిక్‌ని తగ్గించి వాడటం, వాటర్‌ని పొదుపుగా వాడుకోవడం అలాంటి విషయాలు పై అవగాహన కల్పించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు రాకుండా ఉండే విధంగా వారికి పరిసరాలపై అవగాహన కల్పించడంలోఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ చాలా కృషి చేస్తుందని కోఆర్డినేటర్ అన్నపూర్ణ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

కొడాలి నాని ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - గుడివాడ : మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) బుధవారం రాత్రి స్థానిక 29వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి గత 20 సంవత్సరాలుగా గుడివాడ అభివృద్ధికి చేసిన పనులు చూసి, వైసిపి ప్రభుత్వం 5సంవత్సరాలలో ప్రతి ఇంటికి అందించిన సంక్షేమం గుర్తు పెట్టుకుని మళ్ళి వైసిపి అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, ఎంవి నారాయణరెడ్డి, దుక్కిపాటి శశి భూషణ్, అడబాల అప్పారావు, బోయిన వీరరాఘవయ్య, దాసు, శొంఠి నాంచారయ్య, బలగా చైతన్యసుధా, వెంపటి సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొడాలి నాని

'బాబు ష్యూరిటీ' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలో టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము బుధవారం రాత్రి పర్నాస, చిన్నవానిగూడెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళీలతో కలసి వెనిగండ్ల రాము ఇంటింటికి వెళ్ళి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొడాలి రామరాజు, డాక్టర్ గోర్జి సత్య నారాయణ చల్లగుల్ల ఆదిత్య, పల్లపోతు బసవయ్య, పట్టి మంజయ్య, గంట అక్కయ్య ,జానకీ రామయ్య, కట్టా సుబ్రమణ్యాం, మజ్జి శ్రీనివాసరావు ,కొదమల గంగాధర్ పాల్గొన్నారు.

చిన్నాపురంలో 'గడపగడపకూ సంక్షేమం'

గ్రామాల్లో పర్యటిస్తున్న పేర్ని కిట్టు

ప్రజాశక్తి మచిలీపట్నంరూరల్ : అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన జగనన్న చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ శాసనసభ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కొనియాడారు. గురువారం పేర్ని కిట్టు మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామంలో గడప గడపకు మన సంక్షేమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ 2019 పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం మేర నెరవేర్చిన ఘనత జగన్ మోహన్ రెడ్డికె దక్కుతుందని అన్నారు.రైతుల సంక్షేమం కోసమే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. పార్టీలకు,కులాలకు,మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు జన్ను రాఘవరావు, లంకె వెంకటేశ్వర రావు, చిటికెన నాగేశ్వరరావు, తోట వాసు, జంపాన సుబ్రహమణ్యం, ఎన్. గొల్లపాలెం సర్పంచ్ బండి దేవానందం, రాజులపాటి వెంకటేశ్వర గౌడ్ పలువురు గ్రామస్థులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కోడూరు : ఉల్లిపాలెం భవానిపురం వారిది సమీపంలో కష్ణా నదిలో యువకుడు మృతదేహం గురు వారం లభ్యం అయినట్లు అవని గడ్డ సీఐ త్రినాథ్ తెలి పారు. ఈ యువకుడు కోడూరు మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన పోనమాల మధుసూ దనరావు మేనల్లుడు చిన్న శంకర్రావు(33) గా గుర్తించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

భార్య,బావమరిదిపై దాడి

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక గౌడ పేటలో భార్యాభర్తల మధ్యన రేగిన వివాదంలో భర్త భార్యని హతమార్చే క్రమంలో కత్తితో దాడి చేసిన సంఘటన గురువారం జరిగింది. ఎస్సై శివప్రసాద్ కథనం ప్రకారం.. గౌడ పేటలోని తోడేపాడు చెరువు ఒడ్డున ఉంటున్న మసిముక్కు వెంకటేశ్వరరావు, భార్య మసిముక్కువడ్డీ కాసులు మధ్య తగాదాలు జరుగుతున్నాయి. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త పెట్టే ఇబ్బందులతో తాను ఇంట్లో ఉండలేనని వడ్డీ కాసులు చెప్పింది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి తన పుట్టిల్లు అయిన హనుమాన్ జంక్షన్ వెళ్లిపోవడానికి వాహనంలో సామాగ్రి పెడుతున్నారు. ఆమె తమ్ముడు రాజకుమార్ కూడా ఉన్నారు. అప్పుడే డ్రైవింగ్ పనికి వెళ్లి వచ్చిన వెంకటేశ్వరరావు సామాన్లు తీసుకువెళ్లడంపై ఆగ్రహించాడు. వెంటనే ఇంట్లోకి వెళ్లి దాచిపెట్టిన కోడి కత్తిని తీసుకొని భార్య వడ్డీ కాసులు ను నాలుగు చోట్ల పొడిచాడు. ఆమె కేకలు విని బయట ఉన్న తమ్ముడు రాజకుమార్ ఇంట్లోకి వెళ్లి అడ్డుపడగా అతనిపైన దాడి చేసి పొడిచాడు. ఈ ఘటనలో ఇద్దరు తీవ్ర గాయాలకు గురయ్యారు. కోడి కత్తి దాడిలో రక్త కారుతున్న మహిళను వెంటనే స్పందించిన స్థానికులు 108 కి కాల్ చేయగా వాహనం రాలేదు. స్పందించిన గ్రామస్తులు టూ వీలర్ పై దగ్గరలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా రాజ్ కుమార్ ను కూడా తీసుకువెళ్లారు. ఆసుపత్రి సిబ్బంది పరిస్థితి విషమంగా ఉందని అంటూ సమాధానం ఇవ్వడంతో దగ్గరలో ఉన్న చిన్న ఆవుటపల్లి పిన్నమనేనిసిద్ధార్థ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు

పింఛనుదారులను ఇబ్బందులకు గురిచేయడం తగదు : టిడిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవ్వ తాతల పింఛన్ సొమ్ము కాంట్రాక్టర్లకు దోచిపెట్టి పింఛన్లు ఇవ్వడం చేతకాక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శవరాజకీయాలు చేస్తున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనసీమ పులి వెందుల కన్నా దారుణంగా తయారైంది అన్నారు. జగన్ ది సంక్షేమం కాదని సంక్షోభ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు. టిడిపి జనసేన బిజెపి జండాలు వేరైనా అజెండా ఒకటే అన్నారు. అందువల్ల ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయకుండా లబ్ధిదారులను రోడ్లపైకి తీసుకువచ్చి వారిని ఇబ్బందులకు గురిచేసి ఆ నేరమంతా ప్రతిపక్షాలపై ప్రయత్నం చేశారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డికి ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు బండి రాఘవ, బచ్చు రఘునాధ్, కొట్టే విజయ్, ఎలవర్తి చిన్న, షేక్ బాబావాలి, మెగావత్ గోపి, డేగల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను గురువారం రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ మన్మధరావు, జస్టిస్ హరనాధ్ దంపతులు, జస్టిస్ రఘునందన్‌రావు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం అందజేశారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-గంపలగూడెం: లింగాల గ్రామానికి చెందిన కాసర(పాల) వెంకటరెడ్డి స్థానికంగా ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 20వేల రూపాయలు విలువైన ప్రింటర్ ను గురువారం బహుకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలైన అంకిరెడ్డి అంజనారెడ్డి, పైడిమర్ల కృష్ణారెడ్డి పాల్గొనగా పాఠశాల హెచ్ఎం చెర్లపల్లి రమేష్ ప్రింటర్ను అందుకున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 65వ జాతీయ రహదారి ఆటో నగర్ (ఫుడ్ ప్లాజా) వద్ద యూటర్న్ అవుతున్న కారు, అదే సమయంలో విజయవాడ వైపు నుండి హైదరాబాద్ వైపు వస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఆటోలోని వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

వాటర్ కూలర్ వితరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మంచినీటి కూలింగ్ ఫ్రీజర్ ఎంతగానో ఉపయోగపడుతుందని కళే లలిత చారిటబుల్ ట్రస్ట్ అధినేత కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. అజిత్ సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధి వద్ద గురువారం డివిజన్ శానిటరీ కార్యాలయానికి కళ్ళే నాగేశ్వరరావు కూలింగ్ ఫ్రీజర్ వితరణ చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ చెత్త సేకరణ చేస్తున్న శానిటరీ సిబ్బంది సేవలు ఎనలేనివని కళ్లే అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ పి.రామకృష్ణ, ముప్పూరి హరీష్, సైకం సాయిబాబా, బలుసుపాటి మహేష్, చల్లగాలి అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-నందిగామ: గత ఎమ్మెల్యేలు చేయలేని. రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులను చేసి చూపించామని నందిగామ ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ విజయరామన్ హాస్పిటల్ ఏరియాలో ప్రతి ఇంటికి తిరుగుతూ సంక్షేమ, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ వైసీపీ అభ్యర్థి ఎంఎల్ఎ మొండితోక జగన్ మోహన్ రావు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఓట్లు, సీట్లు కోసం ఆలోచించే మనస్తత్వం తమది కాదని... ప్రజల అవసరాల కన్నా రాజకీయాలు ఎక్కువ కాదని... ఎవరు సాహసం చేయని విధంగా... సీఎం రోడ్డును విస్తరించి - ఎన్.టీ.ఆర్ రోడ్డుగా అభివృద్ధి చేశామని తెలిపారు.

భవానీపురంలో ఒకేరోజు మూడు చోట్ల దొంగతనాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: స్థానిక భవానీపురంలో ఒకే రోజు మూడుచోట్ల దొంగతనాలు జరిగిన సంఘటన భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం నాడు వెలుగు చూసింది . స్థానిక భవానిపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలో అప్నా బజార్ రోడ్లో ఒక మెడికల్ షాప్ లో అలాగే దాని సమీపంలో ఓ బడ్డీ కొట్లో దొంగలు షాపులను పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిసింది. అలాగే వెల్లంపల్లి కాలనీ 8 బ్లాక్ లో నివాసం ఉంటున్న ఓ కుటుంబానికి చెందిన టూ వీలర్ ఫ్రెంట్ వీల్ దొంగిలించుకు పోయారని సంబంధిత కుటుంబ సభ్యులు ప్రజాశక్తి కి తెలిపారు. స్థానిక సమాచారం మేరకు ఈనెల మూడవ తేదీ బుధవారం రాత్రి ఓ బడ్డీ కొట్టులో ఉంచిన సుమారు రూ. 6 వేలు నగదు దొంగి లించినట్లు తెలిసింది. అలాగే వెల్లంపల్లి కాలనీ 8వ బ్లాక్ లో నివసిస్తున్న నాగవరపు సాంబశివరావుకు చెందిన హీరో హెూండా స్పెండర్ (ద్విచక్ర వాహనం) ముందు చక్రం (ఫ్రెంట్ విల్) దొంగిలించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. దీనిపై సంబంధిత బాధితులు భవానిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఒకే రోజున మూడు చోట్ల దొంగతనాలు జరగటంపై స్థానికులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. రాత్రి సమయాలలో పోలీస్ బీట్ కొరవడిందని భావిస్తున్నారు .ఇప్పటికైనా భవానిపురం స్టేషన్ సీఐ వి. కష్ణ స్పందించి చోరీలను నివారించాలని స్థానికులు కోరుచున్నారు. నైట్ బీట్ ను పకడ్బందీగా నిర్వహించే విధంగా వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిరువూరుకు చేరుకున్న స్వర్ణోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-తిరువూరు: ట్రాక్టర్ తయారీలో అగ్రగామి అయిన స్వరాజ్ కంపెనీ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాంగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన స్వర్ణోత్సవ ర్యాలీ గురువారం తిరువూరు చేరుకుంది. ఈసందర్భం గా స్వరాజ్ ట్రాక్టర్ అదీకత డీలర్, హరిసాయి మణి కంఠ టాక్టర్స్ మేనేజింగ్ డైరెక్టర్ సూరెడ్డి సురేష్ ర్యాలీకి మేళతాళాలతో, బాణాసంచా కాల్చి స్వరాజ్ ట్రాక్టర్ల కస్టమర్స్, మిత్రులు, రైతులు, బంధుమిత్రులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈవేడుకలో ఎన్టీఆర్, కష్ణ, ఉమ్మడి గుంటూరు రైతు మిత్రులు, సహ డీలర్ మిత్రులు, స్వరాజ్ కంపెనీ స్టేట్ హెడ్ శ్రీనివాస్, ఏరియా మేనేజర్ మహేంద్ర, టెరిటరీ మేనేజర్ కషేంద్ర గౌడ్, హరి సాయి మణికంఠ ట్రాక్టర్స్ డైరెక్టర్ సూరెడ్డి సునీత పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

రాష్ట్రంలో బీసీలకు అవకాశాలు కల్పించింది, వారి సంక్షేమానికి పెద్దపీట వేసింది టిడిపి మాత్రమే అని, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన బిసి యాదవ్‌లు మేకపోతుల సత్యనారాయణ, మేకపోతుల శ్రీనివాసరావు, మేకపోతుల వంశీ, పరిటాల వినయ్ తదితరులు బుధవారం రాత్రి తాతయ్య సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి శ్రీరాం జయ, శ్రీరాం తాతయ్యలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఎన్నికల సమాచారం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎన్నికల విధివిదానాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయడానికి మీడియా పాయింట్‌ని ఏర్పాటు చేయాలని, ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేయాలని ఎపిఎంపిఎ జగ్గయ్యపేట నాయకులు గురువారం తహశీల్దార్ ద్వారా ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గంలో మీడియా వారికి ఆర్ఓ కార్యాలయం నుండి ఎటువంటి సమాచారం అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియంపిఏ అధ్యక్ష, కార్యదర్శులు కాకరపతి రమేష్, కళ్యాణపు సూర్యప్రకాశరావు, జిల్లా ఉపాధ్యక్షులు మెటికల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గడ్డం రాంబాబు, బేతు రంగా, తాళ్లూరి దుర్గారావు, శ్రీరాం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు నాణెం బహూకరణ

ప్రజాశక్తి-గంపలగూడెం: నూతన వధూవరులకు విజయ డైరీ సంస్థ నుండి బంగారు నాణాన్ని గురువారం అందజేశారు. మండలంలోని అనుములంక గ్రామ నివాసి కందికొండ ప్రతాపరెడ్డి కుమారుడు ప్రశాంత్ రెడ్డి-మంజుష నూతన దంపతులకు నాణెం అందజేశారు. సంస్థ నిర్ణయం మేరకు 180 రోజుల్లో 180 లీటర్ల పాలను సదరు కేంద్రానికి పోసిన రైతు కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుంది. పెండ్లి సమయానికి 20 వేల రూపాయల విలువగల బంగారు నాణ్యాన్ని ఇచ్చే స్కీమును సంస్థ ప్రవేశపెట్టింది. స్థానిక కేంద్ర అధ్యక్షుడు భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో తిరువూరు ఏరియా మేనేజర్ సాంబమూర్తి ఈ బంగారు నాణాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరసాని శ్రీనివాస్ రెడ్డి, డైరీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణంలోని తొర్రగుంటపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంను గురువారం జగ్గయ్యపేట నియోజకవర్గ యువనాయకులు, ఆ వార్డ్ కౌన్సిలర్ సామినేని వెంకట కష్ణ ప్రసాద్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున కార్యకర్తలు, నాయకులు బూత్‌ల వారీగా శ్రమించి జగనన్న అందించిన పథకాలు, అలాగే నియోజకవర్గంలో ఉదయభాను చేస్తున్న అభివద్ధిని ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

వాలంటీర్ వ్యవస్థకు వ్యతిరేకం కాదు : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి నెట్టెం శ్రీ రఘురామ్ స్వగృహంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా రఘురాం మాట్లాడతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు టిడిపి ఏదో వాలంటీర్లకు వ్యతిరేకమని ప్రచారాన్ని చేస్తున్నారు, తెలుగుదేశం పార్టీ వాలంటీర్ల వ్యవస్థ పట్ల ఏనాడు వ్యతిరేకరను కనపర్చలేదు, నిజానికి ప్రయోజనాల్ని ప్రజలకు అందించడంలో ఎప్పుడూ కూడా తెలుగుదేశం పార్టీ ముందుందని చరిత్ర చెబుతుంది, అసలు పరిపాలనని ప్రజలవద్దకు తీసుకెళ్లిందే తెలుగుదేశం పార్టీ, ప్రజల వద్దకు పరిపాలన మా కాన్సెప్ట్ తెలుగుదేశం పార్టీకే సొంతం, ఎన్టీ రామారావు దగ్గర నుంచి చంద్రబాబు నాయుడు వరకు ప్రజల వద్దకు పరిపాలన తీసుకెళ్లాలి అలాగే ప్రభుత్వం ప్రజలకిచ్చే అన్ని ప్రయోజనాల్ని, సౌకర్యాల్ని ప్రజలకు దగ్గరగా అందుబాటులో తీసుకొనివెళ్లాలనేది టిడిపి నినాదమన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకులు గింజుపల్లి రమేష్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధికార ప్రతినిధులు తాళ్లూరు వెంకటేశ్వర్లు, షేక్ అన్వార్, టిడిపి నాయకులు సూరపనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నెట్టెం రఘురాం



డబ్బు, మద్యం, వస్తు పంపిణీలపై నిఘా

- రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం

మాట్లాడుతున్న నీనా నిగం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు అధికారులు సమిష్టిగా సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం సూచించారు. సాధారణ ఎన్నికలు 2024 సంబంధించి ఎన్నికల సంఘం రాష్ట్ర వ్యయ ప్రత్యేక పరిశీలకులుగా నియమిం చిన నీనా నిగం గురువారం కలెక్టరేట్ సందర్శించారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఎన్నికల సంబంధిత అధికారులతో కలెక్టరేట్లో స్పందన మీటింగ్ హాల్లో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి పాల్గొన్నారు. జిల్లాలో మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాలు మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు, పెనమలూరు, గన్నవరం, గుడివాడ ఉన్నాయని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి 16 అంశాలకు నోడల్ అధికారులను నియమించినట్లు ఇంచార్జ్ కలెక్టర్ రాష్ట్ర వ్యయ పరిశీలకులకు వివరించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఎలక్షన్స్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం కింద ఏర్పాటుచేసిన ఆయా బందాలు ఇప్పటివరకు సీజ్ చేసిన డబ్బు, మద్యం, వస్తు వివరాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంచార్జ్ కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యయ పరిశీలకులు నీనా నిగం మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పార్లమెంటు నియోజకవర్గానికి 95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గానికి 40 లక్షలు వ్యయ పరిమితి విధించిందన్నారు. ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి చేస్తున్న వ్యయం నిబంధనలకు లోబడి ఉండాలని అన్నారు. ఆయా పార్టీలు అభ్యర్థులు ఎన్నికల్లో చేస్తున్న వ్యయం ఎప్పటికప్పుడు ఆయా బృందాల ద్వారా గుర్తించి వారి ఖాతాల్లో నమోదు చేయవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించి అనధికారికంగా చేస్తున్న వ్యయం ఉదాహరణకు డబ్బు, మద్యం, వస్తు పంపిణీ పై గట్టి నిఘా ఉంచాలన్నారు. న్యాయ సమ్మతం లేని ఖర్చులపై దష్టి సారించాలన్నారు. చెల్లింపు వార్తలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ జిల్లా సరిహద్దు చెక్పోస్టులు, అంతరాష్ట్ర సరిహద్దులలో నిఘా ఉంచి ఎన్నికల్లో అక్రమ మద్యం, డబ్బు, ప్రలోభాల రవాణా అరికట్టే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మచిలీపట్నం గుడివాడ రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు వారి నియోజకవర్గాల్లో ఎన్నికల ఏర్పాట్లు ఈ సమావేశంలో వివరించారు. అనంతరం రాష్ట్ర వ్యయ పరిశీలకులు జిల్లా కలెక్టర్ ఇన్చార్జ్ జిల్లా ఎస్పీలతో కలిసి డిఇఓ కార్యాలయ మీటింగ్ హాల్లో ఏర్పాటుచేసిన ఎన్నికల ఫిర్యాదుల పరిష్కార విభాగం పరిశీలించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, ఏ ఎస్ పి జి వెంకటేశ్వరరావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, వివిధ ఎన్నికల అంశాల నోడల్ అధికారులు పాల్గొన్నారు .

రుణమాఫీ చేయాలని ధర్నా చేస్తున్న దృశ్యం

టిడ్కో గృహాల రుణం మాఫీ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్నికలముందే టిడ్కో అప్పు రుణమాఫీ చేస్తామని రాజకీయ పార్టీలు ప్రకటించాలని కోరుతూ టిడ్కో కాలనీ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో సి.30 బ్లాక్ సందులో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. గురువారం ఆర్.సంగమ్మ అధ్యక్షతన నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో కార్యదర్శి బి.అరుణ మాట్లాడుతూ వారం రోజుల్లో ప్రకటించపోతే 500 మందితో ట్యాంక్ దగ్గర భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రాజకీయ నాయకులు కంటి తుడుపు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. స్పష్టంగా బాధ్యత తీసుకొని రుణమాఫీ చేయిస్తామని ప్రకటించాలని కోరారు. కమిటీ సభ్యులు ఏ ఆదినారాయణ, ఉపద్యక్షురాలు ఎమ్ దుర్గ, రమణ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి అని సహకార శాఖ జిల్లా అధికారి కె చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇందుపల్లి పిఏసిఎస్ లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అందరూ తమ ఓటును నీతిగా, నిజాయితీగా, నిర్భయంగా వినియోగించుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా చైతన్యవంతంగా స్వతంత్రంగా ఓటు వేసి నిజాయితీ గల ప్రతినిధులను ఎన్నుకోవాలని, తద్వారా రాష్ట్రానికి, దేశానికి మంచి జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునేలా చైతన్యం చేయవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవికుమార్, మండలంలోని పిఏసిఎస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎదుగుదల చూసి ఓర్వలేక తప్పుడు కేసులు : వెంపటి

ప్రజాశక్తి - గుడివాడ : తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక తనపై తప్పుడు కేసులు పెట్టినట్లు వైసిపి జిల్లా నాయకుడు వెంపటి సైమన్ అన్నారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రభుటిస్టాల్ వద్ద ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ వైసిపి పార్టీలో తన ఎదుగుదల ఓర్వలేక తమ సామాజికవర్గానికి చెందిన వెల్పుల నాగబాబు తనపై ఉదోగ్యాలు ఇప్పిస్తానని, ఒక వక్తి వద్ద డబ్బులు తీసుకున్నట్లు తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ విషయంలో పోలీసులు విచారణ జరిపి నిజాలు బయట పెట్టాలన్నారు. ఇలాంటి కేసులు పెట్టిన నాగబాబుపై పరువు నష్టం దావాను వేయడం జరుగుతుందన్నారు.

కొడాలి నానిపై విమర్శలు విడ్డూరం : వైసిపి



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ ప్రజలకు నీళ్ళు రాకుండా అడ్డుకుంటున్న వ్యక్తులు కొడాలి నానిపై తాగునీటి సరఫరాపై ఆవాకులు చవాకులు పేలడం విడ్డూరంగా ఉందని జిల్లా వైసిపి నాయకుడు మండలి హనుమంత రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఏలూరురోడ్డులోని వైసిపి ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ ఎంపిపి పెయ్యల ఆదాంతో కలసి మండలి హనుమంతరావు మాట్లాడుతూ గత 20 సం॥లుగా సొంత డబ్బు వెచ్చించి నీటి సరఫరా కోసం ట్యాకర్లు దారా తాగునీరు అందిస్తున్న భగీరదుడు కొడాలి నాని అన్నారు. ఇక్కడే పుట్టి ఇక్కడ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వ్యక్తి ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ప్రతిపక్షంలో ఉండి కూడ అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిని కలుసుకునేందుకు గుడివాడ నుండి హైదరాబాద్ వరకు ఇంటి స్థలాల కోసం, తాగునీరు నీటి నివారణ తొలగించేందుకు 118 ఎకరాలలో కొత్త పంపుల చెరువును ఏర్పాటు చేసిన వ్యక్తి నాని అన్నారు. గుడివాడలో పుట్టి అమెరికాలో వ్యాపారాలు చేసిన వ్యక్తి ఇప్పటి వరకు గుడివాడకు చెంబుడు నీరు కూడా ప్రజలకు అందించని వ్యక్తి నేడు గుడివాడకు అది చేస్తాము ఇది చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.. గుడివాడలో పేద కుటుంబాల కోసం సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తి కాబట్టే 4సార్లు ఎమ్మెల్యేగా కొడాలిని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కొడాలి నాని 30వేల మెజార్టీతో గెలుస్తారని ధీమాను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు అల్లం రామ్మోహనరావు, షేక్ బాజీ, కొర్నిపాటి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక పాలిటెక్నిక్ నందు 800 మంది విద్యార్థులకు ఉచిత పాలీసెట్ కోచింగ్ పొందుతున్నట్లు ప్రిన్సిపల్ ఎన్ రాజశేఖర్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలు పూర్తిచేసుకున్న విద్యార్థులు డిప్లొమా విద్యను అభ్యసించాలంటే ఎస్‌బిటిఇటి బోర్డ్ వారు నిర్వహించే పాలీసెట్ 2024 పరీక్ష వాయాల్సి వుంటుందని, పరీక్ష వాయుటకు ముందుగా విద్యార్థులందరూ కూడా ఆన్ లైన్ లో పాలీసెట్-2024కు అప్లై చేయాల్సి ఉందని అన్నారు. అప్లై చేయుటకు చివరి గడువు ఈనెల 5వ తేదీతో ముగుస్తుందని ప్రిన్సిపల్ తెలియజేసారు. పాలీసెట్ పరీక్ష రాసి, ఉత్తీర్ణలైన విద్యార్థులు మాత్రమే వారు కోరుకున్న పాలిటెక్నిక్‌లలో అర్హతను బట్టి ఉచిత విద్యను అభ్యసించగలరని, పాలీసెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులవ్వాని విద్యార్థులు డిప్లొమా ఉచిత విద్యను అభ్యసించలేరని అట్టి విద్యార్థులు సంవత్సరానికి రూ.25,000 చొప్పున మూడు సంవత్సరాలకు గాను రూ.75,000 ఫీజును చెల్లించి చదువుకోవాల్సి ఉంటుందని తెలియజేసారు. అదేవిధంగా గుడ్లవల్లేరు పరిసరప్రాంతాలలోని విద్యార్థులకు ఎఎఎన్ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాలిటెక్నిక్ నందు సుమారు 800 విద్యార్థులకు ఉచిత పాలీసెట్ కోచింగ్‌ను అందిస్తున్నామని కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులందరూ కూడా ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకొని మంచి ర్యాంకులు సాధించాలని అన్నారు. అలాగే విద్యార్థులు మూడు సంవత్సరాల డిప్లొమా అయిన తరువాత వారి ప్రతిభను బట్టి మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థాయికి వెళ్లొచ్చని ఈ సందర్భంగా తెలియజేసారు. మరిన్ని వివరాలకు 7997508931 నంబర్‌లో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ పాలీసెట్ కో ఆర్డినేటర్ కొడాలి శరత్ బాబు ని సంప్రదించాలని తెలిపారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

చింతపల్లి లక్ష్మారాయుడుకు నివాళి

ప్రజాశక్తి-గన్నవరం : కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు చింతపల్లి లక్ష్మారాయుడు నాలుగో వర్ధంతి సభ గురువారం బుద్దవరం కళ్యాణ మండపంలో సిపిఎం నాయకులు బడుగు మరియదాసు అధ్యక్షతన జరిగింది. దీనిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. రఘు, సిపిఐ నాయకులు కొండా వీరస్వామి, కంభంపాటి పాపారావు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొని చింతపల్లి లక్ష్మారాయుడు ప్రజా సమస్యలపై స్పందించిన తీరును వివరించారు. బుద్దవరం పంచాయతీలో కమ్యూనిస్టులు సుదీర్ఘ కాలం పాటు పనిచేయడంలో ఆయన పాత్ర ఎంతో ఉందని తెలిపారు. రైతు కుటుంబంలో జన్మించిన పేదల పక్షాన నిలబడి పని చేశారని వివరించారు. గ్రామంలో కళ్యాణ మండపం అభివద్ధికి లక్ష్మారాయుడు కుటుంబ సభ్యులు అందించిన సహకారం ఎంతో ఉందన్నారు. ఆయన భౌతికంగా లేకున్నా చేసిన సేవలు గుర్తుంటాయన్నారు.

సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు గన్నవరం నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్ సతిమణి జ్ఞానేశ్వరి తెలిపారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలోని రాజుల కాలనీ, చాగంటి వెంకటప్పయ్య వీధిలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె ఇంటింటికి తిరుగుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను, గన్నవరం నియోజకవర్గ అభివద్ధికి వెంకట్రావ్ చేపట్టబోయే సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాభిగాని కొండయ్య, రేగళ్ళ రాజా, అద్దేపల్లి సాంబ, కొంగన రవి, బొమ్మసాని అరుణ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించిన 'ఠాగూర్' విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - విజయవాడ : గవర్నర్‌పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో చదువుకుని ఉద్యోగం సాధించిన విద్యార్థికి గురువారం సన్మానం జరిగింది. ఇటీవల నిర్వహించిన ఐబిపిఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన జుజ్జువరపు కిరణ్ అనే విద్యార్థి సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందాడు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కె.రమాదేవి ఆ విద్యార్థిని శాలువా, జ్ఞాపికతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

అవనిగడ్డ జనసేన అభ్యర్థిగా బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ అసెంబ్లీకి జనసేన పార్టీ తరఫున మండలి బుద్ధ ప్రసాద్ పోటీచేస్తారని ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఇటీవల పవన్ కళ్యాణ్ సమక్షంలో పిఠాపురంలో జనసేన కండువా కప్పుకున్న బుద్ధ ప్రసాద్‌కు అవనిగడ్డ సీటును కేటాయిన్నట్లు గురువారం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. బుధప్రసాద్ 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2014 ఎన్నికలలో టిడిపి అభ్యర్థిగా ఇక్కడ నుండి పోటీ చేసి విజయం సాధించారు. 2019లో టిడిపి తరపునే పోటీచేసి వైసిపి అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు చేతిలో ఓటమిపాలయ్యారు. అయితే టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో అవనిగడ్డ సీటును జనసేనకు కేటాయించగా ఆ పార్టీ నుండి అయిదారుగురు పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో బుద్ధప్రసాద్ జనసేన పార్టీలో చేరి ఆ పార్టీ నుండి టికెట్ దక్కించుకున్నారు. దీనిని జీర్ణించుకోలేని జనసేన పార్టీకి చెందిన ఆశావాహులు తీవ్ర అసంతప్తిని వ్యక్తం చేశారు. బుద్ధ ప్రసాద్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి తాము జనసేనకు రాజీనామా చేస్తామని హెచ్చరించారు. అయినా అధిష్టానం మాత్రం వారి హెచ్చరికలను లెక్కచేయకుండా బుద్ధ ప్రసాద్‌కు సీటు కేటాయించింది..

జనసేనకు పలువురు రాజీనామా

అవనిగడ్డ సీటును మండలి బుద్ధప్రసాద్‌కు కేటాయించడంతో జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను వాట్సప్ ద్వారా జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణకు పంపారు. మిత్రులు, శ్రేయోభిలాషులతో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను మీడియా సమావేశం ద్వారా తెలియపరుస్తానని రాయపూడి తెలిపారు. అలాగే టిడిపి, జనసేన పార్టీ సమన్వయ కమిటీ సభ్యుడిగా ఉన్న చెన్నగిరి సత్యనారాయణ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామాను పార్టీ జిల్లా అధ్యక్షునికి పంపినట్లు తెలిపారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను సంప్రదించకుండా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అలాగే పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్న అన్నపురెడ్డి యేసు బాబు కూడా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కోడూరు, మోపిదేవి, చల్లపల్లి మండలాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు కొందరు బుద్ధ ప్రసాద్‌కు సీటు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకున్నారు.

67 మందికి జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : మద్యం సేవించి వాహనాలు నడిపిన 67 మందికి న్యాయస్థానం వారు జరిమానా విధించారు. గురువారం 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 67 కేసులలో మద్యం సేవించి వాహనాలు నడిపిన చోదకులకు ఎనిమిదో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి విజయ్ కుమార్ రెడ్డి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

CHANGE OF NAME

I, SAGGURTHI KRISHNABABU (Old Name) S/o. SAGGURTHI ROSAIAH & SAGGURTHI ANNAMMA resident of D.No.1-80, GOSAVEEDU, N.T.R. District, Andhra Pradesh, Pin Code - 521403, INDIA.
I have changed my name as **SAGGURTI KRISHNA BABU** (New Name) S/o. SAGGURTI ROSAIAH & SAGGURTI ANNAMMA. Hereafter my name is known as **SAGGURTI KRISHNA BABU** (New Name) **S/o.SAGGURTI ROSAIAH & SAGGURTI ANNAMMA.**

Sd/- S.KRISHNA BABU.

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఏ. నెం. 317/2023
ఇన్ ఓ.యస్. నెం. 546/2014

బిట్వీన్ :
ఇంటూరి ఆదిలక్ష్మీ ....పిటీషనర్ / వాది
మరియు
బోను నాగమణి మరియు 7 గురు ఇతరులు
.... రెస్పాండెంట్లు / ప్రతివాదులు
5వ రెస్పాండెంట్ అడ్రస్ :
వల్లభనేని భాను ప్రకాశ్, తండ్రి : సుబ్రహ్మణ్యేశ్వరరావు, హిందూ, వయస్సు 49 సం॥లు, డోర్ నెం. 10-154-హెచ్4, రాజేంద్రనగర్, 3వ లైన్, గుడివాడ, కృష్ణాజిల్లా.

పై ఐ.ఎ. నెం. 317/2023లో పై కోర్టు ద్వారా 5వ రెస్పాండెంట్‌కు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా నోటీసు అమలు జరుపుటకు పై కోర్టువారు ఉత్తర్వులు యిచ్చినందున ఇందుమూలంగా తెలియజేయుటమైనది. కావున ది. 18-4-2024వ తేదీ ఉదయం గం.10-30ని.లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ, మీ తరపున న్యాయవాది గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపవలెను. లేనిపక్షంలో పరోక్షమున తీర్మానం చేయబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 18-4-2024

ఇట్లు
గుడివాడ
ది.4-4-2024
రెడ్డి బంగారయ్య,
అడ్వకేటు, గుడివాడ.
సెల్ :9290198674

మొదటిపేజీ తరువాయి

తాగునీటికి కటకట

ఉపక్రటించినట్లయింది. ప్రకాశం బ్యారేజి ఎగువన పులిచింతల ప్రాజెక్టులో అరకొరగా ఉన్న 4.8 టిఎంసిల నీటిలో కొంత నీటిని తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేస్తున్నారు. ఈనీటినే కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని అన్ని స్టోరేజీ ట్యాంకులను నింపాల్సి ఉంది. అవసరం మేరకు దఫదఫాలుగా తక్కువ మొత్తంలో నీటిని విడుదల చేస్తే భూమిలోకి ఇంకిపోవడం, ఆవిరిరూపంలో ఎక్కువ మొత్తంలో నీరు వృధా అవుతుంది. ఈ క్రమంలోనే నీటిని విడుదల చేస్తున్నామని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నింపితేనే కొంతమేర తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

పలు గ్రామాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా

వేసవి ప్రారంభంలోనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో (మంచినీటి చెరువులు) నీరు అడుగంటింది. దీంతో కృష్ణాజిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో తాగునీటికి రేషన్ పెట్టారు. పరిమితంగా మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. పెడన అసెంబ్లీ నియోజకవర్గంలోని 27 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా మనిషికి 15 లీటర్ల చొప్పున సరఫరా చేస్తున్నారు. మచిలీపట్నం సమీపంలోని తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి మట్టం తగ్గిపోవడంతో ఉన్న నీటినే పొదుపుగా వాడుతున్నారు. మచిలీపట్నం కార్పొరేషన్, పెడన మున్సిపాల్టీతోపాటు మరో 110 గ్రామాలకు కొన్నిసార్లు రెండు రోజులకు, మరికొన్నిసార్లు మూడు రోజులకు ఒకసారి మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కృష్ణాజిల్లాలో 266 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులున్నాయి. ఐదు ట్యాంకుల్లో నీరు పూర్తిగా ఖాళీ అయింది. రెండు చెరువుల్లో సామర్థ్యంలో 25 శాతం, 42 చెరువుల్లో 50 శాతంలోపు మాత్రమే నీరు నిల్వ ఉంది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వ అడుగంటడంతో పెడన మండలంలోని 17 గ్రామాలకు, కృత్తివెన్ను మండలంలోని ఐదు గ్రామాలు, బంటుమిల్లి మండలంలోని ఐదు గ్రామాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ గ్రామాల్లో నివసించే వారికి ఒక్కొక్కరికి 15 లీటర్లు మాత్రమే సరఫరా అవుతోంది. గూడూరు మండలం తరకటూరులో ఉన్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా మచిలీపట్నం కార్పొరేషన్, పెడన మున్సిపాల్టీతోపాటు గూడూరు, పెడన, మచిలీపట్నం రూరల్ మండలాల్లోని 110 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈట్యాంకులో 3,300 ఎంఎల్‌డి నీరు నిల్వ ఉండాల్సి ఉండగా, 1000 ఎంఎల్‌డికి తగ్గిపోయింది. దీంతో గతంలో రోజువిడిచి రోజు నీటిని సరఫరా చేసే మచిలీపట్నం కార్పొరేషన్‌కు రెండు రోజులకు ఒకసారి మాత్రమే సరఫరా చేస్తున్నారు. పెడన మున్సిపాల్టీకి మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బందరు రెవెన్యూ డివిజన్లోని మచిలీపట్నం నగరపాలక సంస్థలో 1.80 లక్షల మంది, పెడనలో 35 వేల మందితోపాటు 110 గ్రామాలకు సంబంధించిన మరో 1.50 లక్షల మంది తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. సముద్ర తీరానికి దగ్గరగా ఉన్న ఈ పట్టణాలు, గ్రామాల్లో భూగర్భంలో ఉప్పునీరు ఉంది. తాగునీటి సరఫరా తగ్గిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఉప్పునీటినే రోజువారీ ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాల్సి వస్తోంది.

అంతర్రాష్ట్ర సరిహద్దులో అప్రమత్తం

జిల్లాల సమన్వయ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రెండు జిల్లాల డీఈవో, సీపీలతో పాటు వివిధ విభాగాల నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సిటిజన్ ఫ్రెండ్లీగా ఎన్‌ఫోర్స్‌మెంటు విభాగాలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రాజుపేట అష్టలక్ష్మీ టెంపుల్ చెక్‌పోస్టు, గంపలగూడెం రాజవరం చెక్‌పోస్టు, నూతిపాడు చెక్‌పోస్టులతోపాటు అటువైపు ముత్తగూడెం, ఖాజీపురం చెక్‌పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేసినట్లు వివరించారు. పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు ఎదురయ్యే సవాళ్లను రెండు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎదుర్కోనున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ బందాలు (ఎఫ్‌ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ బందాలు (ఎస్‌ఎస్‌టీ) క్రియాశీలంగా పనిచేస్తున్నాయని.. రెండు జిల్లాల ఉన్నతాధికారులు, నోడల్ అధికారులు ఇదేవిధమైన సహకారాన్ని ఎన్నికలు ముగిసేవరకు కొనసాగించనున్నారని తెలిపారు. జిల్లాకు మంచి సహాయ సహకారాలు అందిస్తున్న ఖమ్మం జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు.

సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దష్టి : సీపీ కాంతిరాణా టాటా

ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా మాట్లాడుతూ డబ్బు, మద్యం వంటి వాటి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిలువరించేందుకు ఖమ్మం జిల్లా అధికారుల సహాయ సహకారాలతో సరిహద్దు గ్రామాలపై ప్రత్యేకంగా దష్టిసారిస్తున్నట్లు తెలిపారు. పోలీస్, సెబ్, రెవెన్యూ, ఎక్సైజ్, అటవీ, బ్యాంకింగ్ తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల మధ్య సమన్వయానికి ప్రత్యేక సమాచార మార్పిడి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతమున్న చెక్‌పోస్టుల వద్ద నిఘాతో పాటు వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలను ముమ్మరం చేస్తున్నట్లు వెల్లడించారు. డబ్బు, మద్యంతో పాటు గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరం మేరకు అదనపు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయనున్నామని, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేకంగా దష్టిసారిస్తున్నామని సిపి వెల్లడించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ మాట్లాడుతూ గతేడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్‌టిఆర్ జిల్లా నుంచి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం, సమాచార మార్పిడి, డ్రై డే, ఎన్‌ఫోర్స్‌మెంటు తదితరాల్లో మంచి సహకారం లభించిందన్నారు. ఇదే రకమైన సహకారాన్ని ఈ ఎన్నికల సమయంలో ఎన్‌టీఆర్ జిల్లాకు అందిస్తామని తెలిపారు. రెండు జిల్లాల మధ్య పరస్పర సహకారానికి ఈ సమావేశం మంచి వేదికని వి.పి.గౌతమ్ పేర్కొన్నారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ ధన బలం, కండ బలం రహిత శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సరిహద్దు వెంబడి నిఘా విషయంలో రెండు జిల్లాల మధ్య పటిష్ట సమన్వయం ఉన్నట్లు తెలిపారు. స్థానిక అధికారుల సహకారంతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. డబ్బు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణాను నిలువరించేందుకు ప్రధాన రహదారులతో పాటు డొంక రూట్ల పైనా దష్టిసారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాకు సహాయ సహకారాలు అందిస్తున్న ఖమ్మం జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్, సీపీ సునీల్ దత్‌లను ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, సీపీ కాంతిరాణా టాటాలు సత్కరించారు. ఈసమావేశంలో తిరువూరు ఆర్‌డీవో కె.మాధవి, నందిగామ ఆర్‌డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌వో జి.వెంకటేశ్వర్లు, ఖమ్మం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ నోడల్ అధికారి ఎం.కష్ణమూర్తినాయుడు, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, రెండు జిల్లాల పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, ఎన్నికల వ్యయం, రవాణా తదితర విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో మోసగించిన వైసిపి, టిడిపి

ఇళ్లను కాగితాలతో సరిపెట్టాయన్నారు. రిజిస్ట్రేషన్ల పేరుతో జగన్మోహన్ రెడ్డి పేదలను మోసం చేశారన్నారు. పేదలకు తాత్కాలికంగా భ్రమలు పెట్టి మభ్యపరిచారని విమర్శించారు. ఇళ్లిస్తామని చెప్పి టిడిపి ప్రభుత్వం వేలాది రూపాయలు వసూలు చేసిందన్నారు. లబ్ధిదారుల నుండి నేతలు డబ్బు గుంజారని గుర్తుచేశారు. ఇళ్లివ్వకుండా తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు రెండూ ప్రజలను వంచించాయన్నారు. రెండు ప్రభుత్వాలను ప్రజలు చూశారని, ఈసారి సిపిఎంకు ఓటు వేయాలని కోరారు. చెత్తపన్ను రద్దు చేయిస్తామని, చెత్త పనుపై ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు. నీటి మీటర్లకు వ్యతిరేకంగా పోరాడి అడ్డుకున్నామని, అజిత్ సింగ్‌నగర్ లోని ఎక్సెల్ ప్లాంట్లో నిర్మించి ఖాళీగా ఉన్న ఇళ్లను త్వరగా లబ్ధిదారులకు అందిస్తామన్నారు. డిస్నీల్యాండ్‌లో కబేళా ప్రతిపాదన రద్దుచేసి, పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇప్పిస్తామన్నారు. కార్మికులకు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సిపిఎం కృషి చేసిందన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ప్రమాద సమయాల్లోనూ ప్రభుత్వం నయాపైసా సహాయం చేయకపోయినా, కార్మిక సంఘాలు, సిపిఎం అండతో కార్మిక కుటుంబాలకు లక్షలాది రూపాయల సహాయం ఇప్పించామని తెలిపారు. అంగన్వాడీ, మున్సిపల్, ముఠా, ఆటో తదితర కార్మికుల పోరాటాలకు సిపిఎం నేతలు అండగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టినా కార్మికుల తరపునే పోరాటం సాగించామన్నారు. అన్ని పోరాటాలలో కార్మికులకు మద్దతుగా సిపిఎం నిలుస్తోందన్నారు. విజయవాడ నగరంలో 10 సంవత్సరాలు పాటు వామపక్షాలను గెలిపించిన చరిత్ర నగర ప్రజలకు ఉందన్నారు. పలుసార్లు శాసనసభ్యులుగా ఎన్నుకున్నారని గుర్తుచేశారు. ఈసారి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సిపిఎంను గెలిపించి అసెంబ్లీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, నేతలు కె.సరోజ, ఏ.వెంకటేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్, పి.కష్ణమూర్తి, వై.రమేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచి** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కొత్తపల్లి పుష్పమ్మ** భర్త : కొత్తపల్లి పాపారావు, వయస్సు : 42 సం॥, నివాసం: ఇ.నెం. 3-142, గోసవీడు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్.టి.ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావునసదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు,అగ్రిమెంట్‌లు,కోర్టువివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి

ఎన్.టి.ఆర్.జిల్లా, గంపలగూడెం మండలం, గోసవీడు గ్రామపంచాయితీ ఏరియాలోని, గోసవీడు గ్రామంలో ఆర్.యస్. నెం.257/9, దాఖాలా య. 0.02 సెంట్లు మరియు ఆర్.యస్. నెం. 257/10 దాఖల య. 0.05 సెంట్లు వెరశి మాకు హక్కు డాక్యుమెంట్ నెం.**7359/2023** గల మొత్తం : 338.8 చ॥గ॥లకు సరియైన 283.236 చ॥మీ॥ నందు గల ఆర్‌సిసి డాబా, రేకుల వసారా వగైరాలు గల నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : పంచాయతీ రోడ్డు, **దక్షిణము** : పంచాయతీ రోడ్డు, **పడమర** : గద్దల వెంకటేశ్వర్లు గారి స్థలం, **ఉత్తరం** : గద్దల వెంకటేశ్వర్లు గారి స్థలం,.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం, 9848022542

మహారాజశ్రీ మార్కాపురం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్. 39/2017

సందు పెద్ద వెంకటేశ్వర్లు (చనిపోయినందున)
మరియు ఇతరులు వగైరాలు .... అప్పిలెంట్లు
వర్సెస్
సందు పెద్ద బాబు మరియు ఇతరులు
.... రెస్పాండెంట్లు
ఆర్10) సందు బాల పుల్లయ్య,
తండ్రి: రంగయ్య (చోలమే)
కూరగాయల వ్యాపారం, రాజరాజేశ్వరి గుడి దగ్గర,
దర్శిపేట-2, పటమట, విజయవాడ-10
ఆర్21) సందు రాములమ్మ,
భర్త: రంగయ్య, హిందూ, గృహిణి,
ఆర్22) సందు పాండు, తండ్రి: రంగయ్య,
హిందూ, వ్యాపారం,
21, 22 నివాసం: దర్శివారివీధి,
పటమట, విజయవాడ-10.

పై నెంబరు అప్పీలును అప్పిలెంట్లు మీ పైన మరి కొందరిపైన అప్పీలు దాఖలు చేసి ఉన్నారు. ఈ అప్పీలు నందు మీకు కోర్టు వారి నుండి అప్పీలు నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ అందుట లేని కారణంగా కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా అప్పీలు నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసి యున్నారు. కావున మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల వాయిదా19-04-2024వ తేదీ ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షముగా విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియ జేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా : 19-04-2024

ఆర్.వి.నాగేశ్వరశాస్త్రి
అడ్వకేట్, మార్కాపురం

ఎన్నికల కోడ్ అమలేదీ...?

బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో ఎన్నికల కోడ్ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా టీడీపీ, జనసేన నేతలు బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుకుంటుంటే ఎన్నికల నియమాలని అమలు చేయవలసిన ఎన్నికల అధికారులు, పంచాయతీ కార్యదర్శి కనీసం పట్టించుకోవటం లేదని పలువురు ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరకట్టపై బస్సు, ఇతర వాహనాలు నిలిపివేసి సంబరాలు చేసుకుంటున్నా, సామాజిక మాధ్యమాల్లో అవి వైరల్ అవుతున్నా ఎందుకు పట్టించుకోవటం లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. మండల స్థాయి అధికారిణి శేషమాంబ పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ పంచాయతీ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయకపోవటంతో ఇలాంటి పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. జనసేన పార్టీ అభ్యర్థిగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కు గురువారం టిక్కెట్ కేటాయించటం పట్ల ఆయా పార్టీల నేతలు సంబరాల నేపథ్యంలో ప్రధాన రహదారిపై టపాసులు కాల్చి, వాహనాలతో సందడి చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియ మావళిని ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశించినా పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఈ తతంగం పట్ల ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతుంది. ఆయా పార్టీల అధికారులకు ఎన్నికల నియమావళి గురించి స్పష్టంగా చెప్పకపోవటంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించారా లేక ఎన్నికల నియమావళి మమ్మల్ని ఏం చేస్తుందిలే అని నిర్వహించారా అని ప్రజలు ప్రశ్నించటం కొసమెరుపు.

అవార్డు అందుకుంటున్న బ్యాంకు చైర్మన్, తదితరులు

సిజిజిబికి ఎక్స్‌లెన్స్ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు : న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన 97వ స్కాచ్ సమ్మిట్‌లో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సిజిజిబి) ప్రతిష్టాత్మకమైన స్కాచ్ కార్పొరేట్ ఎక్సలెన్స్ గోల్డ్ అవార్డును అందుకుంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ సెక్టార్స్ కేటగిరీ కింద ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌లో పని తీరుకు సిజిజిబి ఈ అవార్డు అందుకుంది. ఈ అవార్డు ఆర్థిక అక్షరాస్యత, ప్రతి ఒక్కరికీ బ్యాంకు సేవలను అందుబాటులో ఉంచడాన్ని సూచిస్తుందని బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వర రావు పేర్కొంటూ, ఈ అవార్డు మా కస్టమర్‌లు, షేర్ హోల్డర్లకు ఉన్నతమైన బ్యాంకింగ్ సేవలను అందించడంలో మా నిబద్ధతను చూపిస్తుందన్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, జనరల్ మేనేజర్ డాక్టర్ బి.వి.రమణారావు, సీనియర్ మేనేజర్, హెచ్‌ఒడి ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ కె.ఆంజనేయులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ విజయం బ్యాంకింగ్ రంగంలో అభివద్ధి, నూతన ఆవిష్కరణలకు ప్రతిబింబమని, మా కషిని గుర్తించిన స్కాచ్ అవార్డుల జ్యూరీకి బ్యాంకు చైర్మన్ కృత జ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును బ్యాంకు ఉద్యోగులకు అంకితమిస్తున్నట్లు కామేశ్వరరావు తెలిపారు.

ర్యాలీని జయప్రదం చేయండి

మాట్లాడుతున్న వల్లభనేని అనుదీప్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన తనయుడు వల్లభనేని అనుదీప్ కోరారు. మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు స్తానిక మూడు స్తంభాల సెంటర్ నుండి ర్యాలీగా బయలుదేరి కోనేరుసెంటర్ నుండి పరాస్ పేట సెంటర్ ,రామా నాయుడుపేట సెంటర్ నుండి జవ్వారుపేట సెంటర్, చింత చెట్టు సెంటర్ లినాగబో తరావుసెంటర్ మీదుగా మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి కార్యాలయానికి చేరుకుని అనంతరం పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జనసేన, టిడిపి, బిజెపి, నాయకులు కార్యకర్తలు మహిళా విభాగం, ఎన్డీఏ కూటమి వివిధ విభాగాల ప్రతినిధులు పెద్ద ఎత్తున ఈ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి విజయ్,గడ్డంరాజు, పినిశెట్టి వేణు, మహమ్మద్ సమీర్, కర్రీ మహేష్, కూనపురెడ్డి ప్రసాద్, గంపలకష్ణ, తోటభాస్కర్, పద్వి, నాగరాజు, ఆంజనేయులు, శాయనశివ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది గంట సతీష్‌కుమార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వత్తి ప్రాక్టీస్ చేస్తున్న గంట సతీష్‌కుమార్‌కు కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. సతీష్‌కుమార్ వర్సిటీ న్యాయశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఐ.పవన్‌కుమార్ మార్గదర్శకత్వంలో 'సైబర్‌క్రైమ్ అండ్ సైబర్ లా ఇన్ ఇండియా పర్స్‌పెక్టివ్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంట సతీష్ కుమార్‌కు కేఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కె.వి.ఎస్.ఎం కామ్‌సాయి, ఎం.రమాసత్యనారాయణ, న్యాయవాదులు వట్టి జొన్నల బ్రహ్మారెడ్డి, చింత రామకోటిరెడ్డి, సురేంద్ర తదితరులు అభినందనలు తెలియజేశారు.

వర్సిటీలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - ఎఎన్‌యు : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ అలోచనలు ఆచరణలోకి తీసుకెళ్లాలని యోగి వేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి ఆర్. సతీష్ బాబు పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయంలో జగజ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు బాబు జగజీవన్ రామ్ ఛైర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు ఛైర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ మధుబాబు అధ్యక్షత వహించారు. సతీష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలనీ, ఆయనలోని రాజకీయ చైతన్యాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ ప్రజల ఆకాంక్షలను సంతోషాలను, వారి భవిష్యత్ కోసం పార్లమెంటులో ఆచరణకు కృషి చేశారని అన్నారు. సుదీర్ఘ పార్లమెంట్ సభ్యునిగా జగజీవన్ రామ్ స్థాపించిన రికార్డును ఎవరు అందుకోలేరన్నారు. జగ్జీవన్ రామ్ పై విస్తృత పరిశోధనలు చేయాలని సూచించారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ మాట్లాడుతూ ఆలోచన పరంగా, ఆచరణ పరంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా జగజ్జీవన్ రామ్ గొప్పతనాన్ని గుర్తు ఎరగాలన్నారు. విశ్వవిద్యాలయంలో ఉన్న జగ్జీవన్ రామ్ ఛైర్ దేశ నలు మూలల నుంచి పరిశోధకులు వచ్చేలా పరిశోధనలు, పుస్తకాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కోఆర్డినేటర్ ఆచార్యకే మధుబాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో ఉన్న జగ్జీవన్ రామ్ ఛైర్ ద్వారా జగ్జీవన్ రామ్ ఆలోచన దృక్పథాన్ని సమాజానికి అందజేసే పరిశోధనలు, కార్యక్ర మాలు చేస్తున్నామన్నారు. ముందుగా వర్సిటీలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాక్రమంలో ప్రిన్సి పల్ కే. గంగాధర రావు, సీహెచ్. స్వరూప రాణి, పి. జాన్సన్, పి. సిద్ధ య్య, ఈ. శ్రీనివాస రెడ్డి, అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బట్టు నాగ రాజు, జి. చెన్నారెడ్డి, కో ఆర్డినేటర్ లు జి. అనిత, వై . అశోక్ కుమార్, కే.సోమ శేఖర్, ఎం. త్రిమూర్తి రావు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపకులపతి

పాలనాధక్షుడు బాబూ జగ్జీవన్‌రామ్

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : దేశంలో హరిత విప్లవానికి నాంది పలికిన వ్యక్తి, పాలనాధక్షుడు బాబు జగ్జీవన్‌రామ్ అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి కొనియాడారు. బాబూ జగ్జివన్‌రామ్ 117 వ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ఐదు దశాబ్దాల పాటు దేశ పాలన రంగంలో జగ్జివన్ రామ్ కీలక పాత్ర పోషించారు అని చెప్పారు. కాంగ్రెస్, జనతా ప్రభుత్వాలలో కీలకమైన శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవశాలి జగ్జివన్ రామ్ అన్నారు. రెక్టర్ ఆచార్య డి సర్యచంద్రరావు మాట్లాడుతూ 117సంవత్సరాల తర్వాత కూడా ఆయన జయంతి వేడుకలు జరుపుకోవడం ఆయన ఘనతను తెలియచేస్తోంది అని అన్నారు. ఎ సీ్స, ఎస్టీ విభాగం సమన్వయకర్త డా శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె శోభన్ బాబు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, ఫార్మసీ కళాశాల హెచ్‌ఓడి ఆచార్య మారుతి, విభగాదిపతులు, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

ఓట్లు అభ్యర్థిస్తున్న సింహాద్రి చంద్రశేఖరరావు

సింహాద్రి చంద్రశేఖరరావు పర్యటన

ప్రజాశక్తి-కోడూరు : మండల పరిధిలోని హంసలదీవి గ్రామంలో గల వేణుగోపాల స్వామిని గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ దర్శించుకున్నారు. అనంతరం ఉల్లిపాలెం, వేణుగోపాలపురం, సాలెంపాలెం, పిట్టలంక గ్రామాలు కోడూరు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. మేలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తనను గుర్తించి తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. కోడూరు మండలం జడ్పీటిసి యాదవరెడ్డి వెంకట సత్యనా రాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని జిల్లా బాలికా అభివద్ధి అధికారిని హెచ్ వనిత కోరారు. మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు వృత్తి విద్య కోర్సులను వచ్చే విద్యా సంవత్సరం నుండి 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు వత్తివిద్య కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు బివిఎన్ఎల్ పద్మావతి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కోర్సులైన ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. కావున గ్రామీణ ప్రాంతాల విద్యార్థిని విద్యార్థులు ఈ కోర్సులను సద్వినియోగపరుచుకుని, తద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చు అని ఆమె కోరారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ

వత్సవాయిలో పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేట మండల పరిధిలో 15 సచివాలయాల్లో 8,426 మంది లబ్ధిదారులకు గురువారం నాటికి 7,364 మందికి లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. పెన్షన్ పంపిణీ సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగిందని ఎంపీడీవో విజయకుమారి తెలిపారు. **అజిత్ సింగ్‌నగర్:** సింగ్‌నగర్ ప్రకాష్ నగర్ పైపుల రోడ్డు రాజీవ్ నగర్ కండ్రిక తదితర ప్రాంతాల్లో ఉన్న సచివాలయంలో పెన్షన్ గురువారం పంపిణీ చేశారు. ఉదయం 7 గంటల నుండి పెన్షన్లు పంపిణీ కొనసాగించారు. **గంపలగూడెం:** మండల వ్యాప్తంగా 11,726 మంది పింఛను దారులు ఉండగా 9943 మందికి గురువారం నాటికి అందజేసినట్లు ఎంపీడీవో టీవీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. మొత్తంగా 85 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. **వత్సవాయి**: మండలంలో గ్రామ సచివాలయం వద్ద పెన్షన్‌దారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. పెన్షన్ దారులు ఉదయం 7 గంటల నుండి అధికారుల కోసం వేసి ఉన్నారు. గ్రామ సచివాలయాల వద్ద కుర్చీలు, బల్లలు, తాగునీరు లేక ఇబ్బందులకు గురయ్యారు. ప్రహరీ గోడలు పట్టుకొని నిలబడిపోయారు. అధికారులు తొమ్మిది గంటలకు వచ్చి పింఛను ఇవ్వడం ప్రారంభించారు. **నందిగామ:** నందిగామ మండలం రుద్రవరం గ్రామంలో ఫించన్లు కోసం వృద్ధుల అగచాట్లు పడుతున్నారు. గురువారం ఫించన్లు డబ్బులు రావటం తో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెద్ద ఎత్తున రావటం తో కనీసం సౌకర్యాలు పట్ల ఫించన్లు దారులు ఇక్కట్లు పడ్డారు. రామిరెడ్డి పల్లి, జొన్న లగడ్డ, కొణతమాత్మకూరుగ్రామ తదితర గ్రామాలకు ఫించన్లు డబ్బులు సకాలంలో రాకపోవడంతో లబ్ధి దారులు ఇబ్బందులు పడ్డారు.

సింగ్‌నగర్‌లో...

16న ఫిట్జీ ఎర్లీ లీడ్ పరీక్ష

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఐఐటీ చదవాలనుకునే విద్యార్థుల కోసం అత్యుత్తమ శిక్షణ అందించేందుకుగాను ప్రముఖ విద్యా సంస్థ ఫిట్జీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన ఎర్లీ లీడ్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఫిట్జీ డైరెక్టర్ ఆర్.ఎల్.త్రివేది తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ఐఐటీలు, టాప్ ఎన్‌ఐటీలు, ఇతర ప్రతిష్టాత్మకమైన ఇనిస్టిట్యూట్‌లో చదువుకోవాలనుకునే విద్యార్థుల కోసం ఈపరీక్ష ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఐఐటిలో అత్యుత్తమ శిక్షణ అందించడంలో ఫిట్జీ సంస్థ అత్యుత్తమంగా ఉందన్నారు. ఐఐటీ జెఈఈ 2025లో మంచి ర్యాంకు సాధించే లక్ష్యంగా తమ సంస్థ కోచింగ్ ఇచ్చేందుకు కొంత మందిని ఎంపికచేసేందుకు ఈపరీక్షను నిర్వహిస్తుందన్నారు. ఈపరీక్ష కోసం ఈనెల 14వ తేదీగా పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. విద్యార్థులు స్వయంగా ఫిట్జీ కేంద్రాన్ని సందర్శించి వివరాలనే తెలుసుకోవచ్చని లేదా వెబ్‌సైట్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

సోమెట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: హాస్పటాలిటీ ఎడ్యుకేషన్ విభాగంలో అగ్రగామిగా ఉన్న ఇండియన్ స్కూల్ ఆఫ్ హాస్పటాలిటీ, ఎకార్ సంస్థతో భాగస్వామ్యం ఏర్పరచుకోవడం ద్వారా మరిన్ని సేవలను విస్తృతం చేయనున్నట్లు సోమెట్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి కె.ఎం.కె. ప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచ ేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. ముఖ్యంగా యువతలో నైపుణ్యత, స్కిల్స్‌ను పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతకు స్కిల్స్ పెంపొందించంతో పాటుగా హాస్పటాలిటీ పరిశ్రమలో ఉపాధి అవకాశాలను అందించే విధంగా తమ సంస్థ పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు ఎంతో మంది యువతకు స్కిల్స్ అందించడంతో పాటుగా, ఉపాధి అవకాశాలు కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాల ద్వారా యువతకు చేరువకానున్నట్లు తెలిపారు.

ఆర్చరీలో సత్తా చాటిన యుక్తశ్రీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నాల్గో ఎన్‌టిపిసి నేషనల్ ఆర్చరీ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమిలో శిక్షణ పొందుతున్న ఆర్చర్ కె.యుక్తశ్రీ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిందని ఓల్గా ఆర్చరీ అకాడమి అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. మహానాడు రోడ్డులోని అకాడమి కార్యాలయంలో గురువారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో మార్చి 28 వ తేదీనుండి ఏప్రియల్ 5వ తేదీ వరకు జరిగిన ఆర్చరీ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుండి రికర్వ్ విభాగంలో సబ్ జూనియర్ బాలికల కేటగిరిలో యుక్తశ్రీ పాల్గొందని తెలిపారు. మంచి ప్రతిభ కనపరచడంతో పాటు ఛాంపియన్‌గా నిలిచిందని తెలిపారు. రికర్వ్ బాలికల విభాగం సబ్ జూనియర్ కేటగిరిలో ఫైనల్‌కు చేరి ఫైనల్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన జాహ్నవి దేష్‌ముఖ్‌తో తలపడి 5-5 స్కోర్‌తో టై బ్రేక్ కాగా, టైలో 10-9 తేడాతో విజయం సాధించి సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. యుక్తశ్రీ 2023 - 24 సంవత్సరంలో రాయ్‌పూర్‌లో జరిగిన సబ్ జూనియర్ జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటికే చాంపియన్‌గా నిలిచిందన్నారను. ఈర్యాంకింగ్ టోర్నమెంట్ ద్వారా మరోసారి తన సత్తాను చూపించి చాంపియన్‌గా కొనసాగిందన్నారు. ఈటోర్నమెంట్‌లో కోచ్‌గా వ్యవహరిస్తున్న నవీన్‌కుమార్‌కు చెరుకూరి ఓల్గా అకాడమి తరపున అభినందనలు తెలిపారు.

వైసిపి 'తూర్పు' కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: క్రీస్తురాజపురం పెద్ద బావి సెంటర్ వద్ద తూర్పు నియోజకవర్గ ప్రాంతీయ ఎన్నికల కార్యాలయాన్ని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్, తూర్పు నియోజకవర్గ వైకాపా ఎంఎల్ఎ అభ్యర్థి దేవినేని అవినాష్ ప్రారంభించారు. ఈసందర్భంగా కేశినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గ వైసిపి కేడర్ అంతా విజయోత్సాంతో ఉందన్నారు. అవినాష్ విజయానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన రిటైనింగ్ వాల్‌ను పూర్తి చేయించడంలో అవినాష్ ఎంతో కృషి చేశారన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తూరుప నియోజకవర్గంలో వైసీపీ జెండా ఎగురవేయనున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా భారీ మెజార్టీతో సీట్లు గెలువబోతున్నామని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో వైసిపిని గెలిపించడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు.

క్లౌడ్ గేమింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: నేడు క్లౌడ్ గేమింగ్‌ఉక ఎంతో ప్రాధాన్యత పెరుగుతుందని ఇందులో భాగంగానే మొబైల్ క్లౌడ్ గేమింగ్ సర్వీసు ప్రారంభించేందుకు విఐ సంస్థ ముందుకు వచ్చిందని సంస్థ ప్రతినిధి కుమార్ .ఎస్. తెలిపారు. నగరంలోని విఐ సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశీయంగా గేమింగ్ రంగం ఎంతో వృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యంగా మొబైల్స్ వచ్చాక గేమింగ్ సర్వీసు సెంటర్ పెరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే కేర్ గేమ్ సంస్థ క్లౌడ్ గేమింగ్ సేవలను అందిస్తుందన్నారు. ప్రముఖ టెలికాం ఆపరేటర్ విఐ సంస్థ ఆధ్వర్యంలో క్లౌడ్ ప్లే పేరుతో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో యాక్షన్‌చ అడ్వెంచర్, ఆర్కేడ్, రేసింగ్, స్పోర్ట్స్ వంటి సేవలను అందిస్తున్నారన్నారు.

7న ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: వినోద, విజ్ఞాన కార్యక్రమాలను అందిస్తున్న జీ తెలుగు ఛానల్‌లో ఈనెల 7వ తేదీన సాయంత్రం 6 గంటలకు ఉగాది వేడుకలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఛానల్ రీజనల్ ప్రతినిధి కె.ఈశ్వర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది అంతే తెలుగు వారి పండుగ అని ఈపండుగ సందర్భంగా ఎన్నో కొత్త కార్యక్రమాలను అందించేందుకుగాను ప్రత్యేకంగా ఉగాది కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆట పాటలు, హుషారైన డ్యాన్సులు, సరదా నవ్వులతో మంచి వినోదభరితంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఈకార్యక్రమానికి ప్రముఖ హీరో విజయ దేవర కొండ ముఖ్య అతిధిగా పాల్గొంటారని తెలిపారు.

ఆర్‌కె ఇంజనీరింగ్‌లో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈ నెల, 4 తేదీల్లో నిర్వహించిన అడ్వాన్స్‌డ్ ట్రెండ్స్‌పై నేషనల్ కాన్ఫరెన్స్ గురువారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ సాయిరాం, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ హెచ్ హరీష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ శాస్త్రాలు మరియు సాంకేతికతలో తాజా పురోగతులపై ఉద్దేశపూర్వకంగా మరియు ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి దేశంలోని వివిధ మూలల నుండి నిపుణులు, పరిశోధకులు, పండితులు మరియు అభ్యాసకులను ఒకచోట చేర్చడం ఈ సదస్సు లక్ష్యమన్నారు. వివిధ కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని వారి యొక్క సాంకేతిక విజ్ఞాన పరిశోధన లను ప్రదర్శించడం జరిగినది ఈ కార్యక్రమమునకు సుమారు 350 మంది పాల్గొని వారి పరిశోధనలను ప్రజెంట్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు వారి యొక్క నిర్ణయాన్ని వెల్లడించి, కార్యక్రమంలో ఎవరైతే వారి యొక్క ప్రజ్ఞను వివిధ విభాగాలలో ప్రదర్శించి మొదటిగా నిలిచారో, వారందరికీ విశిష్ట బహుమతి ప్రశంసా పత్రము మరియు పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమం సాంకేతిక విజ్ఞాన విలువలను పెంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మరియు ఆవశ్యకతను తెలియజేస్తూ ఈ కాన్ఫరెన్స్ మేధోపరమైన చర్చలకు, రంగంలో ఆవిష్కరణ మరియు సహకారాన్ని పెంపొందించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుంది.ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్ హెచ్ ఈ ఈవెంట్ కు సంబంధించి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక సదస్సును నిర్వహించేందుకు మేము సంతోషిస్తున్నాము, ఇది ఇంజినీరింగ్ శాస్త్రాలలో విజ్ఞానం, ఆవిష్కరణలు మరియు నైపుణ్యం యొక్క సమ్మేళనంగా ఉపయోగపడుతుంది. సాంకేతికతతోకూడిన మా లక్ష్యం

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సాయిరాం, హరీష్

నేర్చుకోవడం మరియు నెట్‌వర్కింగ్‌కు అనుకూలమైన వాతావరణాన్ని సష్టించడం, చివరికి ఫీల్డ్ పురోగతికి దోహదపడుతుంది అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండ్రగుంట రామకష్ణయ్య మరియు వైస్ ప్రిన్సిపాల్ ఐ సాయి రామ్ నేతత్వంలోని ఆర్ కె కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గౌరవనీయ నాయకత్వం, సుసంపన్నమైన సదస్సులో పాల్గొని ఇంజినీరింగ్ సైన్సెస్ మరియు టెక్నాలజీ రంగంలోని విద్యారంగ వద్ధిని పెంపొందించడంలో మరియు తాజా పోకడలు మరియు పరిణామాలతో నవీకరించబడటంలో ఇటువంటి సంఘటనల ప్రాముఖ్యతను వారు నొక్కిచెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.